ప్రతిభకు ప్రోత్సాహం

- ఏడాదికి రూ.12వేల ఉపకార వేతనం 8
- నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 30 వరకు గడువు.. డిసెంబరు 7న పరీక్ష
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అర్హులు

శక్తి పీఠం..పిఠాపురం



పుర్హుతికాఅమ్మవారు



రాజరాజేశ్వరీదేవి

అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం.. అధిష్ఠాన దేవతైన పుర్హుతికాదేవి కొలువై ఉన్న పిఠాపురం పాద గయ క్షేత్రం.. దక్షిణకాశీగా, శక్తిపీఠంగా విరాజిల్లుతోంది. స్వయం భూగా వెలసిన కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి,ఆదిశంకరాచార్య స్వామి ప్రతిష్ఠింపబడిన రాజరాజేశ్వరీదేవి ఇక్కడే కొలువై ఉన్నారు. శక్తిపీఠం కావడంతో ఇక్కడ పుర్హుతికా అమ్మవారిని దర్శించుకుని కుంకుమపూజలు, చండీయాగం చేయించుకునేందుకు ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు కర్నాటక, మహారాష్ట్ర, ఒరిస్సాఢిల్లీ, గోవా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలు నుంచి భక్తులు వస్తారు. పరాశక్తి ఆజ్ఞ మేరకు మహావిష్ణువు సతీ మృతదేహాన్ని తన సుదర్శనచక్రంతో ఖండించాడు. సతీ దేహభాగా లు భూమిపై పడి 108 శక్తి పీఠాలుగా విరాజిల్లుతున్నాయి. అందులో 101 విశేషంగా, 52 పీఠాలు ముఖ్యమైనవిగా, అతి ముఖ్యమైన 18 భాగాలు పడిన చోట అష్టాదశ శక్తి పీఠాలుగా విరాజిల్లుతున్నాయి. అష్టాదశ శక్తి పీఠాల్లో ముఖ్యమైన పీఠ భాగం(పిరుదులు) పడిన చోటే పిఠాపురంగా విరాజిల్లుతోంది. పాదగయ క్షేత్రంలోని పుర్హుతికా అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదిక్షణ చేస్తుంటే అష్టాదశ శక్తి పీఠాల నమూనా విగ్రహాలు కనిపిస్తాయి.

- (ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

కొండల్లో తలుపులమ్మ

ఆదివారం ప్రత్యేకం

మహిమ గల అమ్మవారు తలుపులమ్మ తల్లి.. కాకినాడ జిల్లా లోవ గ్రామంలో వెలసింది. తూర్పు కనుమల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ధారకొండ, తీగ కొండల మధ్య ఒక గుహలో స్వయంభుగా వెలిసినట్టు ఆలయ పండితులు చెబుతుంటారు. క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు వస్తుంటారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసినప్పుడు ఈ క్షేత్రంలో పూజలు చేస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉంటాయని భక్తుల నమ్మకం.ఈ నేపథ్యంలో నిత్యం కొత్త వాహనాలు, భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడుతూ ఉంటుంది. ఏటా రూ.20 కోట్ల ఆదాయంతో రాష్ట్రంలో ప్రముఖ ఆలయాలతో పోటీ పడుతున్న ఈ దేవస్థానం ప్రసిద్ధి దేవాలయాల్లో ఒకటిగా విరాజిల్లుతుంది.



పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో రూ.20 కోట్లు ఖర్చు చేసి ఆలయ పునః నిర్మాణ పనులు చేపడుతున్నారు.ఏటా ఆషాఢమాసంలో నెల రోజులు ఆలయంలో అమ్మవారికి ఉత్సవాలు నిర్వహిస్తారు.

- (తుని రూరల్-ఆంధ్రజ్యోతి)

జై భవానీ!

దసరా వచ్చిందంటే అమ్మవార్ల ఆలయాలు ప్రత్యేకం.. భక్తులతో కిటకిటలాడుతూనే ఉంటాయి.. మన జిల్లాలోనూ ప్రముఖ ఆలయాలు ఉన్నాయి.. వాటి చరిత్రను ఒకసారి తెలుసుకుందాం.. వీలైతే ఒకసారి చూసొద్దాం..!



భక్తుల పాలిట విజయదుర్గ



భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెదురుపాక విజయదుర్గా అమ్మవారు విరాజిల్లుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో గత 54 ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 1972లో పీఠాధిపతి గాడ్ విజయదుర్గా పీఠాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వెదురుపాక విజయదుర్గా పీఠంలో దేవి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 1989లో ప్రస్తుత శృంగేరి పీఠాధిపతి భారతీయతీర్థ చేతులమీదుగా శంకుస్థాపన చేసి పీఠాన్ని నిర్మించారు. అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య ఆరాధనలు చేస్తున్నారు.దసరా 10 రోజుల పాటు అమ్మవారిని దర్శించుకున్న భక్తులు స్వయంగా శ్రీచక్ర అర్చనలు చేసుకుని అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకుంటారు. గత 54 సంవత్సరాలుగా పీఠంలో ఉచిత నిత్య అన్నదానం జరుగుతుంది.


- (రాయవరం -ఆంధ్రజ్యోతి)

ఏటా..భవానీ మాల



భవానీ మాల చాలా మందికి ఆనవాయితీ.. ప్రతి ఏటా వేస్తారు. దుర్గమ్మ అంటే నమ్మకం. అమలాపురం వెత్సావారి అగ్రహారానికి చెందిన ఆర్లపల్లి ముత్యం ఇప్పటికే పలు పర్యాయాలు భవానీ మాల ధరించి గురుభవానీగా మారారు. ఇప్పటి వరకు సుమారు 15 వేల మందికి భవానీ దీక్ష ఇచ్చారు. అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లిలో శ్రీమురళీకృష్ణస్వామి ఆలయంలో శ్రీదుర్గా వీరభద్ర భవానీ పీఠం నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఐదు పర్యాయాలు భవానీ మాలధారులతో కలిసి కాలినడకన విజయవాడ కనకదుర్గమ్మను దర్శనం చేసుకున్నారు. విజయవాడకు చెందిన రాచకొండ కామేశ్వరశర్మ తొలిసారిగా భవానీ దీక్షను కోనసీమకు పరిచయం చేశారు. ఆయన వద్దే దీక్ష తీసుకుని నేటికీ కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది పీఠం వద్ద దసరాకు 108 మంది భవానీ మాల ధరించారు. ఇక కార్తీక మాసంలో మండల దీక్షకు ఏటా 300 మందికి పైబడి భవానీ మాల ధరిస్తున్నారు. - **(అమలాపురం రూరల్ - ఆంధ్రజ్యోతి)**

నాటి లాంతర్ల సెంటరే..దేవిచౌక్!



బ్రిటీష్ హయాంలో మూడు లాంతర్ల సెంటరే.. రాజమహేంద్రవరం దేవిచౌక్.1933లో బత్తుల మల్లికార్జున రావు సోదరులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో దేవిచౌక్‌గా మారింది. బ్రిటీష్ హయాంలో నాలుగు రోడ్ల కూడలిలో మునిసిపాలిటీ వారు వీధిదీపాలుగా లాంతర్లను ఏర్పాటు చేసేవారు.ఇలా మూడు లాంతర్లను దేవిచౌక్‌లో సాయంత్రం 5:30 గంటలకే వెలిగించి వెళ్లేవారు.అప్పటి నుంచి మూడు లాంతర్ల కూడలిగా దేవి చౌక్‌ను పిలిచేవారు.శ్రీబాలాత్రిపుర సుందరిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించాక మూడు లాంతర్ల సెంటర్ దేవిచౌక్‌గా రూపాంతరం చెందింది. నాలుగు స్తంభాలను నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలా ఆలయ ప్రస్తానం ప్రారంభమైంది. ఇక్కడ నవరాత్రులు 1933లో మొదలు పెట్టారు. ఈ ఏడాది 92వ దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు.

- **(రాజమహేంద్రవరం సిటీ - ఆంధ్రజ్యోతి)**

పెద్దాపురం పెద్దమ్మ మరిడమ్మ



17వ శతాబ్దం నుంచి పెద్దాపురం పెద్దమ్మగా మరిడమ్మ ఆలయం పేరెన్నికగన్నది. పసుపు పూసిన కర్ర గద్దెను అమ్మవారి ప్రతిరూపంగా పూజిస్తారు. మరిడమ్మ జాతర ప్రతీ ఏడాది జ్యేష్ఠమాసంలో అమావాస్య నుంచి ప్రారంభమై ఆషాఢ మాసంలో అమావాస్య వరకూ 37 రోజుల పాటు జరుగుతాయి. పెద్దాపురం మానోజీ చెరువు సమీపంలో గ్రామదే వత గా మరిడమ్మ వెలిశారని స్థానికులు చెబుతారు. అడవిలో పశువులు కాపరులకు 16 ఏళ్ల యువతి కనిపించి నేను చింతపల్లివారి ఆడబ డుచునని చెప్పి మాయమైనట్టు పురాణాలు చెబుతున్నాయి. మానోజీ చెరువు సమీపంలో ఆలయం నిర్మించాలని ఆజ్ఞాపించడంతో అక్కడే తాటాకుపాక వేసి నాడు ఆలయ నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి నేటి వరకూ ధూపదీప నైవేద్యాలను అమ్మవారు అందుకుంటున్నారు.ప్రధాని మోదీ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం ద్వారా పెద్దాపురంలో ఉన్న మరిడమ్మ ఆలయం గురించి ప్రస్తావించారు.

- (పెద్దాపురం -ఆంధ్రజ్యోతి)

గోదావరి సెంట్రల్ డెల్టా స్థిరీకరణకు చర్యలు చేపట్టాలి

- అసెంబ్లీలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):గోదావరి సెంట్రల్‌డెల్టా వ్యవస్థనుబలోపేతం చేసి ఆయకట్టు స్థిరీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అసెంబ్లీలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సర్‌ఆర్థర్ కాటన్ మహానీయుడు 150ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన గోదావరి డెల్టా వ్యవస్థ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతోందన్నారు. తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టాలు అనే మూడు వ్యవస్థలుగా సాగునీరు, మురుగునీటి వ్యవస్థలు అస్తవ్యస్తంగా తయారై మెరకలు, మేటలు, ఆక్రమణలతో పూడుకుపోయి వరదల సమయంలో సముద్రంలోకి గోదావరి నీరు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సాగునీరు విడుదల సమయంలో నీటిలెవిల్స్ మెయింటెనెన్స్ కుదరక రబీలో రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కొత్త ఆయుకట్టు ఏర్పాటుకు కృషి చేస్తూనే నాబార్డ్ లేదా ప్రపంచ బ్యాంకు నిధులను సమీకరించి గోదావరి డెల్టా వ్యవస్థను దశలవారీగా ఆధునికీకరించాలని కోరారు.

ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయండి

- అసెంబ్లీలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి



పి.గన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలంలోని పోతవరంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని, సంబంధితశాఖకు స్థలం కేటాయించారని, ఇప్పటివరకు ఫైర్‌స్టేషన్ నిర్మాణం చేపట్టలేదని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అసెంబ్లీలో ప్రస్తావించారు. ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు బిల్డింగ్‌తోపాటు ఫైర్‌ఇంజన్, సిబ్బందిని నియమించాలని, నియోజకవర్గానికి ఫైర్‌స్టేషన్ అవసరమని సభాపతి దృష్టికి తీసుకువెళ్లారు. నాలుగు మండలాల్లో లోఓల్టేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు ఫెయిల్ అయితే అక్కడ కొత్తవి ఏర్పాటు చేయట్లేదన్నారు. కొత్త వాటికి దరఖాస్తు చేసుకున్నా మంజూరురావడంలేదన్నారు. పి.గన్నవరం సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించే భవనం లేదని, మృతదేహాలను రాజోలు, అమలాపురం ప్రభుత్వాస్పత్రులకు తీసుకువెళ్లాల్సి వస్తోందన్నారు. సీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించాలన్నారు. నరేంద్రపురంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఆస్పత్రి భవనం నిర్మించాలన్నారు.

శంకరగుప్తం డ్రెయిన్‌ను అభివృద్ధి చేయండి

- అసెంబ్లీలో రాజోలు ఎమ్మెల్యే దేవ



మలికిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):రాజోలు నియోజకవర్గంలో రెండు దశాబ్ధాలుగా డ్రైనేజీ వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ శాసనసభలో ప్రస్తావించారు. శంకరగుప్తం డ్రెయిన్ నిర్వహణ సరిగా లేకపోవడంవల్ల రాజోలు నియోజకవర్గంపూర్తిగా ఇబ్బందులకు గురవుతోందని,రాజోలు ప్రాంతం పల్లపు ప్రాంతమని, 4వేల టీఎంసీల నీరు వశిష్ఠ, వైనతేయ నదుల ద్వారా సముద్రంలో కలుస్తోందన్నారు. తమకు ముఖ్యమైన శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ 23 కిలోమీటర్ల పొడవు ఉందని, మొదటి ఏడున్నర కిలోమీటర్లు, చివర 8కిలోమీటర్లు డిసిల్టింగ్ చేశారని, మధ్యలో ఏడున్నర కిలోమీటర్లు చేయకపోవడంవల్ల డ్రెయిన్‌లో కలిసే మీడియం, మైనరు డ్రెయిన్ల నీరు సముద్రంలోకి పూర్తిస్థాయిలో వెళ్లడంలేదన్నారు. దీంతో గోదావరిలో పారక సముద్రం పోటు సమయంలో తిరిగి ఉప్పునీరుచేరి ఇబ్బందిగా తయారవుతోందన్నారు. పంటలు పూర్తిగా నాశనం అయ్యాయని, రిజిస్టర్ ఆయకట్టు 14వేల ఎకరాల నుంచి నాలుగున్నర వేల ఎకరాలకు పడిపోయిందన్నారు.

జీఎస్టీ 2.0 అమలుపై ప్రచార కార్యక్రమాలు చేపట్టండి

- వివిధ శాఖల అధికారులకు జేసీ నిషాంతి ఆదేశం



జీఎస్టీ ప్రయోజనాలపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాల కోసం ఇచ్చిన జీఎస్టీ 2.0 ప్రయోజనాలను క్షేత్రస్థాయికి చేరేవరకు అధికారులు నెలరోజులపాటు కీలకంగా పనిచేయాలని జేసీ టి.నిషాంతి ఆదేశించారు. జీఎస్టీ 2.0, సూపర్ జీఎస్టీ సూపర్ సేవ్ పథకంలో భాగంగా శనివారం ఆమె అధికారులతో సమీక్షించారు. నెలరోజులు ప్రచార కార్యక్రమాలు నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రస్తుతం సెప్టెంబరు 22నుంచి అమలులోకి వచ్చిందని, ఈ పన్ను వ్యవస్థలో తాజా సంస్కరణలు, ప్రజలకు భారీగా ఊరటనిచ్చేలా కేంద్రం రూపకల్పన చేసిందన్నారు.దేశవ్యాప్తంగా రెండు ప్రధాన జీఎస్టీ శ్లాట్‌లు 5శాతం, 18శాతం మాత్రమే ఉన్నాయన్నారు. ఆటోపార్ట్స్, కాస్మోటిక్స్ ట్రాక్టర్లు, చిన్నకార్లు, బైకులు, టీవీలు మొదలైన వాటిపై పన్ను రేట్లు తగ్గాయని, విలాసవంతమైన నిషిద్ధిత కలిగిన వస్తువులపై 40శాతం జీఎస్టీ వర్తిస్తుందన్నారు. ఆరోగ్యానికి సంబంధించి మందులు, ఫెర్టిలైజర్లు, వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీ తగ్గినట్టు వివరించారు. ప్రస్తుతం ఈ సేవింగ్స్ మొదలవ్వడంపై వినియోగదారులు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించడంతోపాటు బీమా, ఆరోగ్య బీమాపై పూర్తిమినహాయింపువల్ల ఆరోగ్యరంగంలో ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అక్టోబరు 19వతేదీ వరకు సూపర్ జీఎస్టీ ప్రచారం చేపట్టాలని ఆమె సూచించారు. సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయి చాంపియన్లను నియమించామన్నారు. బైకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, పాఠశాలల్లో వర్క్‌షాపులు, జీఎస్టీ ప్రయోజనాలపై నిర్వహించాలని సూచించారు. శాఖలవారీగా ప్రదర్శనకు కార్డులను కమర్షియల్ ట్యాక్సు అధికారులు ప్రింట్ చేసి అందించాలన్నారు. పౌరసరఫరాలశాఖవారు చౌకదుకాణాలు, ఎల్పీజీ డీలర్లు, పెట్రోలు బంకుల వద్ద ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. 837 వస్తువులకు, 39 సేవలకు పన్నులు తగ్గించారన్నారు. డీఆర్వో కె.మాధవి, డీఎస్వో ఉదయభాస్కర్, డీఈవో షేక్ సలీంబాషా పాల్గొన్నారు.

దసరాకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



అమలాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా జిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాలు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్టు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు రాహుల్‌మీనా వెల్లడించారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా జిల్లా ప్రజలకు విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియచేశారు. దసరా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణం మధ్య అవాంచనీయ సంఘటనలకు తావివ్వకుండా స్నేహభావంతో పండుగను జరుపుకోవాలని సూచించారు. విజయదశమి సందర్భంగా జిల్లాలో పలుచోట్ల చెడీ తాలింఖానా ఉత్సవాలు, ఊరేగింపులు జరగనున్న నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహించే క్రమంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కమిటీ నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఊరేగింపులకు కేటాయించిన సమయాల్లో వారికి కేటాయించిన రూట్లలోనే జరుపుకోవాలని సూచించారు. దసరాను పురస్కరించుకుని బంధువుల ఇళ్లకు, యాత్రలకు వెళ్లేవారు ఇళ్లల్లోవిలువైన వస్తువులను ఉంచకుండా బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. ఏపీ పోలీసు డిపార్టుమెంటువారు లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను యాప్‌కు అనుసంధానం చేసి అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఇందుకు యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని రిక్వెస్ట్ పెట్టుకుంటే మీ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌నుంచి మీ ఇంటికి వచ్చి కెమెరాను అమర్చి కంట్రోల్‌రూము నుంచి పర్యవేక్షిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోనసీమలో పర్యాటక రంగ అభివృద్ధి : కలెక్టర్

- తూర్పుపాలెంలో హోంస్టేకు అనువుగా మండువా లోగిలి ఇంటికి పర్యాటకశాఖ గుర్తింపు.. పరిశీలించిన కలెక్టర్



తూర్పుపాలెంలో పురాతన గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మలికిపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కోనసీమలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంతాల అభివృద్ధితోపాటు ఆదాయాన్ని పెంచే చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. పర్యాటకులకు స్థానిక పూర్వపు ఆచార సంప్రదాయ గృహాల్లో నివాసం ఇవ్వడం ద్వారా ఈ ప్రాంతపు సంస్కృతి, జీవనశైలిని అభివృద్ధి చెందేలా చేస్తాయని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం హోంస్టే విధానాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. స్థానిక ఆతిథ్యం, ఆహారం, సంస్కృతి, ఆచారాలు, జీవనశైలిని నేరుగా అనుభవించే అనుభూతి కలుగుతుందన్నారు. తూర్పుపాలెంలో అడబాల వీరన్న భవనాన్ని హోంస్టేకు పర్యాటకశాఖ గుర్తించిందన్నారు. మారుమూల గ్రామాల్లో పర్యాటకులకు వసతిసౌకర్యాలు కల్పించడానికి హోంస్టే అతిథిగృహాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రాష్ట్రంలో శనివారం నాలుగు ప్రాంతాలను గుర్తించారని, అరకు, తిరుపతి, విశాఖపట్నం, కోనసీమ ప్రాంతాల్లోని హోంస్టే గృహాలు సమకూర్చే వారితో సీఎం వర్చువల్‌గా మాట్లాడతారని చెప్పారు. తూర్పుపాలెంలో అడబాల వీరన్న భవనాన్ని పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా హోం స్టే అతిథి గృహానికి తీసుకున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మండువా లోగిళ్లు, నూతన కట్టడాలతో పర్యాటకులకు విడిది సౌకర్యాలు కల్పించే చర్యలు చేపడుతున్నామన్నారు. త్వరలో హోం స్టే పాలసీని జిల్లాలో అమలు చేస్తామని గోదావరి సముద్ర తీరం వెంబడి పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. టెంపుల్ టూరిజం, బోటింగ్ టూరిజంలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించడానికి పర్యాటకులు ఎక్కువ ఉత్సాహం చూపుతున్నారన్నారు. వీటిని గుర్తించాక వెబ్‌పోర్టల్‌లో సమాచారం పెడతారని చెప్పారు. హోంస్టేకు గృహాలు ఇచ్చేవారికి అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సహకారం అందిస్తున్నారన్నారు. మలికిపురం మండలంలో 26మంది మహిళాశక్తి సంఘాల సభ్యులు తమ గృహాలను హోంస్టే అతిథి గృహాలుగా అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చారని చెప్పారు. కోనసీమలో సర్వే చేయగా 140 ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. ఈ సందర్భంగా అడబాల వారికి చెందిన మండువా గృహాలను పరిశీలించారు. ఆయన వెంట డీటీవో అన్వర్, డీఆర్డీఏ పీడీ జైచంద్ర గాంధీ, కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు, ఏపీఎం సయ్యద్ పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగుల ద్వారా ఉపాధి ప్రశంసనీయం: కలెక్టర్

మహిళలు అన్నిరంగాల్లోను ముందుకు రావాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. కేశనపల్లిలో ప్లాస్టిక్ రహితంగా జ్యూట్ బ్యాగ్‌లు తయారీ చేస్తున్న శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్ర నిర్వాహకురాలు తోట ఉమామహేశ్వరితో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో 50మంది మహిళలకు శిక్షణ ద్వారా ఉపాధి అవకాశం కల్పించడం ప్రశంసనీయమన్నారు. మరింత నాణ్యతతో మరిన్ని ఉత్పత్తులు తయారు చేసి మరింత ముందుకు వెళ్లాలన్నారు. ఆయన వెంట పీడీ గాంధీ, డీపీవో అన్వర్, తహశీల్దార్ టిశ్రీనివాసరావు, సర్పంచ్ యెనుముల నాగు పాల్గొన్నారు.



కేశనపల్లిలో జ్యూట్ బ్యాగుల కేంద్రం వద్ద మహిళలతో కలెక్టర్ మహేష్‌కుమార్

నేడు విద్యుత్ బిల్లుల వసూళ్లకు ప్రత్యేక కౌంటర్

అమలాపురంరూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో సెలవురోజు ఆదివారంలో కూడా బిల్లుల వసూళ్ల కౌంటర్లు పనిచేస్తాయని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ బి.రాజేశ్వరి తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బిల్లులను చెల్లించాలని కోరారు. విద్యుత్, రెవెన్యూ కార్యాలయాలతోపాటు ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కౌంటర్లు, ఏపీపీ సెంటర్లలోను ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినయోగదారులు సద్వినియోగం చేసుకోవాలని రాజేశ్వరి కోరారు.

పెరుగుతున్న గోదావరి

- నీటమునిగిన కానకాయలంక కాజ్‌వే
- వరదనీటిలో స్థానికుల రాకపోకలు
- ఈ సీజన్‌లో ఐదోసారి కాజ్‌వే నీట మునగడంతో ప్రజల ఇబ్బందులు



కనకాయలంక కాజ్‌వేపై చేరిన వరదనీటిలో స్థానికుల పాట్లు

పి.గన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో దిగువన గోదావరిలో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం గోదావరిలో నీటిమట్టం సాధారణస్థాయికి చేరుకుని వారంరోజులు గడవకుండానే మళ్లీ వరదనీరు పోటెత్తింది. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 10,01,049 క్యూసెక్కులు దాటి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రవహించే వైనతేయ, వశిష్ట, గౌతమి, వృద్ధ గౌతమి నదీపాయలు నిండుగా ప్రవహిస్తున్నాయి. వశిష్టనదిపాయ ఉధృతంగా ప్రవహించడంతో చాకలిపాలెంవద్ద కనకాయలంక కాజ్‌వే మళ్లీ నీటమునిగింది. ఈ సీజన్‌లో ఐదోసారి కాజ్‌వే నీటమునగడంతో లంకగ్రామాల ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. కనకాయలంక గ్రామస్తులు శనివారం ఉదయం వరదనీటిలోనే రాకపోకలు సాగించినా వరద ఉధృతి పెరగడంతో మధ్యాహ్నం నాటుపడవలపై రాకపోకలు సాగించారు. గోదావరిఉధృతి కారణంగా దొడ్డిపట్ల రేవును సైతం తాత్కాలికంగా మూసివేసినట్లు ఆ ప్రాంత అధికారులు తెలిపారు. కాజ్‌వే నీటమునగడంతో పాఠశాలలనుంచి వచ్చే కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటిపెదపూడి వద్ద బూరుగులంక నదీపాయపై పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక, ఉడిమూడిలంక గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన అనగార్లంక, పెదమల్లంక గ్రామస్తులు నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. కాగా అయితే ఇప్పుడిప్పుడే బయట పడుతున్న ఉద్యాన పంటల్లో మళ్లీ వరదనీరు వచ్చి చేరుతోంది. లంకల్లో ఉన్న పల్లపు ప్రాంతాల్లో పలు మార్లు వరదనీరు చేరడంతో పశుగ్రాసానికి సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.



గంటిపెదపూడి వద్ద బూరుగులంక నదిపాయపై పడవ దాటుతున్న లంకగ్రామస్తులు

ప్రతిభకు ప్రోత్సాహం



- ఏడాదికి రూ.12వేలు ఉపకార వేతనం
- నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు

ఈ నెల 30 వరకు గడువు.. డిసెంబరు 7న రాత పరీక్ష

- ప్రభుత్వ పాఠశాలల 8వ తరగతి విద్యార్థులు అర్హులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే ఆ విద్యార్థులు విజయ సోపానాన్ని అధిరోహించడం ఖాయం. చదువుకు పేదరికం అడ్డు కారాదు. ప్రతిభావంతులైన విద్యార్థులు చదువు మధ్యలో ఆపేయకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఉపకార వేతనాలు అందిస్తుంది. దీనిలో భాగంగా ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తుంది. ఈ పరీక్ష రాసేందుకు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు అర్హులు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించిన ప్రతిభా వంతులైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా ప్రతీ విద్యార్థికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనాలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30 వరకు మాత్రమే గడువు ఉంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు డిసెంబరు 7న అర్హత పరీక్ష నిర్వహిస్తారు.

180 మార్కులతో ప్రశ్నాపత్రం..

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష 180 మార్కులకు ఉంటుంది. 90 మార్కులకు మెంటల్ ఎబిలిటీ టెస్ట్ ఎంఏటీ ఉంటుంది. మల్టిపుల్ చాయిస్ విధానంలో ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున ఇస్తారు. స్కాలర్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ కింద 90 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఫిజిక్స్ నుంచి 12, కెమిస్ట్రీ 11, బయాలజీ 12, గణితం 20, చరిత్ర 10, జాగ్రఫీ 10, పొలిటికల్ సైన్స్ 10, ఎకనామిక్స్ సబ్జెక్టు నుంచి 5 మార్కులు చొప్పున ప్రశ్నలు ఉంటాయి. ఈ ప్రశ్నలు అన్నీ 7వ తరగతి పూర్తి సిలబస్, 8వ తరగతిలో నవంబరు వరకు చెప్పిన సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. జనరల్, బీసీ, పీహెచ్ అభ్యర్థులు 40 శాతం అంటే 36 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 32 శాతం అంటే 29 మార్కులను ఎంఏటీ, ఎస్ఏటీలలో విడివిడిగా పొంది ఉంటేనే ఈ పరీక్షలో క్వాలిఫై అయినట్టు.

పరీక్ష రాసేందుకు అర్హతలు..

విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50లక్షల లోపు ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులు 7వ తరగతిలో 55శాతం మార్కులతోను, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50శాతం మార్కులు పొంది ఉండాలి. ఇక 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రభుత్వ, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూల్స్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు.

సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు



జిల్లాలో ప్రతిభావంతులైన విద్యార్థులు అందరూ ఈ పరీక్ష రాసేందుకు చర్యలు తీసుకున్నాం. నెలాఖరు వరకు దరఖాస్తులకు గడువు ఉన్నందున మరింత మంది విద్యార్థులు పరీక్ష రాసే విధంగా పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులకు ముందస్తు శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది జిల్లా నుంచి ఎక్కువ మంది పేద విద్యార్థులు ఉపకార వేతనాలు పొందే విధంగా పాఠశాలల్లోనే తర్ఫీదు పొందుతున్నారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

బీర హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్, కోనసీమ జిల్లా

ప్రత్యేక తరగతులు



కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు జిల్లా నుంచి ఎక్కువ మంది పొందేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఏడాదికి రూ.12 వేలు చొప్పున పొందే ఉపకార వేతనం ఉన్నత విద్యకు ఆలంబనగా నిలుస్తుంది. ఎన్‌ఎంఎంఎస్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా ఎవరికీ భారం కాకుండా ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలి.

డాక్టర్ షేక్ సలీంబాషా, కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 863 ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 2817 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కోనసీమ జిల్లాలో 289 పాఠశాలల్లో 11551 మంది 8వ తరగతి విద్యార్థులు ఉన్నారు. వారిలో ఇప్పటి వరకు 963 మంది దరఖాస్తు చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 252 పాఠశాలల్లో 12,167 మంది విద్యార్థులకుగాను 846 మంది, కాకినాడ జిల్లాలో 322 పాఠశాలల్లో 17,004 మంది విద్యార్థులకుగాను 1008 మంది దరఖాస్తు చేసుకున్నారు.

భద్రతా ఏర్పాట్లు కఠినంగా ఉండాలి

'పీపీ' పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



పరీక్షా కేంద్రాల్లో పటిష్ఠ నిఘాను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, అధికారులు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ) వచ్చే నెల 5న కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించనున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల రాత పరీక్ష నేపథ్యంలో పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శనివారం పరిశీలించారు. పరీక్ష సమయంలో భద్రతా ఏర్పాట్లు కఠినంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాల వ్యవస్థను సమగ్రంగా అమలు చేయాలన్నారు. ఇన్విజిలేటర్లు పూర్తిగా శిక్షణ పొందినవారై ఉండాలన్నారు. పరీక్షా సమయం ముందు, తరువాత యూనివర్శిటీ ప్రాంగణంలో అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆరంభ సమయానికి ముందే అభ్యర్థులు క్రమబద్ధంగా ప్రవేశించే విధంగా గేట్ మేనేజ్‌మెంట్ చేయాలన్నారు. కాపీయింగ్ లేదా మాల్ ప్రాక్టీస్ జరగకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ. సుబ్బారావు పేర్కొన్నారు. అనంతరం ఈసీఈ విభాగంలో ఉన్న పరీక్షా గదులను ఐజీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఐజీ వెంట కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పాటిల్ దేవరాజ్ మనీష్, జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కె ప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ కెవి.సత్యనారాయణ ఉన్నారు.

ఐశ్వర్యాంబిక అనుగ్రహించు...

శ్రీపీఠంలో ఆరో రోజుకు మహాశక్తి యాగం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేట శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో వేలాది మంది మహిళా మూర్తుల ఆధ్వర్యంలో 3వ మహాశక్తి యాగం-2025 వైభవంగా సాగుతోంది. అమ్మా ఐశ్వర్యాంబిక.. లలిత సహస్రనామంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలన్నీ మార్మోగుతున్నాయి. భక్తులను ఉద్దేశించి స్వామి పరిపూర్ణా నంద సరస్వతి మాట్లాడుతూ వెయ్యి కోట్ల లలిత సహస్రనామ కుంకుమార్చనతో చేపట్టిన ఈ మహాక్రతువులో భాగస్వామ్యమైన వారంతా ధన్యులేనన్నారు. మహా తపస్సులో వాక్కు, మనసు ముఖ్యమని, చేత్తో కుంకుమ పారాయణం చేస్తూ మీ శరీరాన్ని అమ్మవారికి అర్పించడం ముఖ్యమన్నారు. లలిత సహస్రనామానికి అనేక శక్తులు ఉన్నాయని, నత్తి ఉన్న వాళ్లు సైతం ఈ నామాన్ని 11 రోజుల్లో నేర్చుకుంటే స్పష్టం గా పలకగల మహాత్యం ఉంద న్నారు. శనివారం ఉదయం శ్రీపీఠంలో వేంచేసిన ఐశ్వర్యాంబిక అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవీగా దర్శనమిచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మంగళచండీ, రాజరాజేశ్వరి హోమాలు నిర్వహించారు. మహాశక్తి యాగం నిర్వహణ కోసం భాగస్వాములుగా ఉన్న పలువురు దాతలకు మహాశక్తి యంత్ర ప్రసాదాన్ని స్వామీజీ అందజేశారు. 18 దివ్య క్షేత్రాల గర్భాలయ అంత ర్భాగమైన శిలల నుంచి సేకరించిన వాటితో మహాశక్తి యంత్రాలను తయారు చేయించామన్నారు. ప్రత్యక్షంగా పాల్గొనలేని వాళ్లు శ్రీపీఠం యూట్యూబ్ ఛానల్లో యాగం కార్యక్రమం లైవ్‌లో తిలకించాలని కోరారు. పూజల్లో సుమారు 35వేల మంది భక్తులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామి పరిపూర్ణా నంద సరస్వతి



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వడపల్లికి పోటెత్తిన భక్తజనం

వెంకన్నకు ప్రత్యేక పూజలు

రూ.52.33 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.52.33 లక్షల ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వాడపల్లి బస్టాండ్‌లో వేలాది మంది మహిళా భక్తులు ఉచిత బస్సు కోసం వేచిఉండి రాకపోకలు సాగించారు. ఆలయంలో, బస్టాండ్‌లలోను ఎక్కువగా మహిళలే కనిపించారు.



శ్రీ వేంకటేశ్వరస్వామికి అలంకరణ



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

కారు ఢీకొని వ్యక్తి మృతి

గండేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామం జాతీయ రహదారిపై మోటారుసైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల ప్రకారం.. గండేపల్లి గ్రామానికి చెందిన బోసనకూరి రంగబాబు(40) గండేపల్లి నుంచి రాజమహేంద్రవరం పని నిమిత్తం వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొని ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు క్షతగాత్రుడిని జీఎస్ఎల్‌కు తరలించారు. అయితే అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. స్థానిక ఎస్ఐ శివనాగబాబు నెంబరు బోర్డు ద్వారా కారుని వెంబడించడంతో ఆచూకీ లభ్యమైంది. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.



మరణించిన రంగబాబు

భార్య పుట్టింటి నుంచి రాలేదని భర్త ఆత్మహత్య

తొండంగి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిల్లలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయి రాకపోవడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడిలో జరిగింది. ఎస్.రాయవరం మండలం ఉప్పరాపల్లి గ్రామానికి చెందిన కిల్లాడ శివ (34)కు ఎలమంచిలి మండలం గుండురుబిల్లికి చెందిన దుర్గతో సుమారు 8 ఏళ్ల క్రితం వివాహమయ్యింది. తొండంగి మండలం ఒంటిమామిడి వచ్చి జీవిస్తున్నారు. శివ ప్రస్తుతం తొండంగి గ్యాస్ ఏజన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసగా మారడంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో దుర్గ తన ఇద్దరు పిల్లలు శ్రావ్య, తేజలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యను తిరిగి వచ్చేయమని శివ ఫోనులో కోరేవాడు. ఆమె ఎంతకీ తిరిగి రావకపోవడంతో మనస్తాపం చెందిన శివ శనివారం ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి భార్యకు తెలిపారు. దీనిపై దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1.70 లక్షల విరాళం



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం కోరుకొండ మండలం గాదరాడకు చెందిన బాదం చక్రవర్తి, సీతామహలక్ష్మి రూ.1.70 లక్షల విరాళం ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, భక్తులు ఉన్నారు.

గాయత్రి అలంకరణలో రత్నగిరి దుర్గలు



అన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా రత్నగిరిపై ఉన్న వనదుర్గ, తొలిపావంచా వద్ద కొలువైఉన్న కనకదుర్గలు గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

లలితాదేవిగా తలుపులమ్మ

తుని రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవ దేవస్థానంలో శనివారం శ్రీ లలితా దేవిగా దర్శనమిచ్చారు.పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు.



వస్తామనుకోలేదు..

- 54 రోజుల పాటు బందీలయ్యాం
- సీఎం చంద్రబాబు, ఎంపీ సానా సతీష్, కూటమి ప్రభుత్వ సహకారంతో బతికి బయటపడ్డాం
- శ్రీలంక నుంచి కాకినాడకు పయనమైన మత్స్యకారులు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

'వస్తామని ఊహించలేదు... జైల్లోనే మగ్గిపోతామనుకున్నాం.. అక్కడ జైలులో ఉన్న తమిళనాడు ఖైదీలను చూసి భయమేసింది. ఒక్కో జైలులో పాపం ఐదు వేల మంది ఉన్నారు. అందరూ కూడా మాలానే బోటు అదుపు తప్పి.. శ్రీలంక సముద్ర జలాల్లో దారి తప్పిన వారే. వారిలానే తాము కూడా ఉండాల్సి వస్తుందేమోననే భయం వెంటాడింది. కానీ ఇండియన్ ఎంబ సీతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు ఇతరుల సహకారంతో మేము బతికి బయటపడ్డాం.. కాకినాడ చేరుకోగలుగుతున్నాం" ఇదీ శ్రీలంక జైలు నుంచి విముక్తులైన మత్స్యకారుల మనోగతమి ది. శ్రీలంక సముద్రజలాల్లో చిక్కుకుని జాఫ్నా జైలులో సుమారు 54రోజుల పాటు నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన మత్స్యకారులు ఎట్టకేలకు కాకినాడ బయల్దేరారు. ఈ సందర్భంగా వారు ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి'కి పలు విషయాలు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే..

కాకినాడ జగన్నాథపురానికి చెందిన మత్స్యకారులమైన మేము కె.శ్రీను వెంకటేశ్వర్, కర్రి నూకరాజు బుర్రయ్య, చందా నాగేశ్వరరావు, పంతాడి బ్రహ్మానందం గత నెల ఆగస్టు 3న నాగపట్నం వెళ్లి ఓ పడవ కొనుగోలు చేశారు. "తిరుగు ప్రయాణంలో చీకటిపోయింది. గాఢాంధకారం.. చుట్టూ చీకటి.. నడిసంద్రంలో దారి తప్పిపోయాం. శ్రీలంక జలాల్లోకి ప్రవేశించాం. రామేశ్వరం వద్ద మూడు కిలోమీటర్లు శ్రీలంక పరిధిలోని సముద్ర జలాల్లోకి పడవ వెళ్లడాన్ని ఆ దేశ నేవీ అధికారులు మమ్మల్ని గుర్తించారు. శ్రీలంక ఫిషరీష్ అధికారుల వద్దకు మమ్మల్ని తీసుకుని వెళ్లారు. వారు మా వివరాలు తెలుసుకుని అన్నీ మాకు అనుకూలంగానే రాసుకున్నా రు. తర్వాత ఇండియన్ ఎంబసీ వచ్చి మా వివరాలు నమోదు చేసుకున్నారు భోజనం పెట్టి బాగా చూసుకున్నారు. మరుసటి రోజు ఉదయం జాఫ్నా పోలీసులకు అప్పగించారు. ఆగస్టు 4 నుంచి జాఫ్నా జైలులోనే ఉన్నాం. అక్కడ జైలులో ఐదు వేల మంది ఖైదీలు ఉన్నారు. వారిలో తమిళనాడుకు చెందిన వారే ఎక్కువ మంది. జైలులో వసతులు కూడా బాగానే ఉన్నాం.

సుమారు నాలుగుసార్లు కోర్టు వాయిదాలకు వెళ్లాం. చివరికి ఈనెల 12న అక్కడి కోర్టు విడుదలకు జడ్జి ఆదేశాలిచ్చారు. అయితే శ్రీలంక నేవీ, కోస్టుగార్డు అధికారులు ఆదేశించినా అప్పగింత ఆలస్యమైంది. తమిళనాడు ఖైదీలు జైల్లోనే మగ్గిపోతున్నారు. దారి తప్పిన తమిళనాడు మత్స్యకార బోట్లు సుమారు 500 వరకు అక్కడే ఉన్నాయి. వాళ్ల జడ్జి మమ్మల్ని వదిలేయడం చూసి ఆశ్చర్యపోయారు." అంటూ కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన మత్స్యకారులు శ్రీలంకలో తాము ఎదుర్కొన అనుభవాలను వివరించారు. ప్రస్తుతం పాండిచ్చేరికి దగ్గరలో ఉన్నామని, 30వ తేదీ సాయంత్రానికి కాకినాడ చేరుకుంటామన్నారు. ఇక్కడంతా వాతావరణం వర్షం, ఉరుములు, మెరుపులతో భయంకరంగా ఉందని, గంట గంటకీ తమ క్షేమ సమాచారం మెసేజ్ కోస్టుగార్డ్‌కు ఇస్తున్నామని, ముందు వెళుతోన్న షిప్‌ను అనుసరిస్తూ వస్తున్నామని కాకినాడకు తిరిగివస్తున్న కాకినాడ జగన్నాథపురం చంద్రిక థియేటర్, మల్లిపూడి వారి వీధికి చెందిన పంతాడి బ్రహ్మానందం, చింతా నాగేశ్వరరావు(భైరవపాలెం, యానాం సావిత్రినగర్, కొప్పాడి శ్రీను ఏటిమొగ, కర్రి నూకరాజు(గంగవరం మండలం మసకపల్లి) పేర్కొన్నారు.



మత్స్యకారుల పడవతో కోస్ట్ గార్డ్ సిబ్బంది



మత్స్యకారులు

ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు

శ్రీలంక కోర్టు కాకినాడ మత్స్యకారులను విడుదల చేయాలని సెప్టెంబరు 12న ఆదేశించినా అక్కడ కోస్టుగార్డు, నేవీ అధికారులు సకాలంలో స్పందించలేదు. దీంతో బందీలైన మత్స్యకారుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. దీంతో వారు విషయాన్ని ఎంపీ సానా సతీష్‌బాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. ఏపీ భవన్ కమిషనర్ డాక్టర్ అర్జా శ్రీకాంత్ దృష్టికి తీసుకువెళ్లి మత్స్యకారులను స్వదేశానికి తీసుకువచ్చేలా చూడాలని కోరడం, ఆయన కోస్టుగార్డ్ కమాండర్ దినేష్‌జేతో చర్చించి విడుదలకు దారి చూపారు. శ్రీలంకలో బందీలైన తమ వారిని స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీలకు మత్స్యకారుల కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఇద్దరు దొంగలు.. 97 చోరీలు..

అంతర్ రాష్ట్ర దొంగలను పట్టుకున్న బొమ్మూరు పోలీసులు

రూ.9.98 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్య కిషోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు అంతర్ రాష్ట్ర దొంగల ఆటకట్టించారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు ఫ్రూట్ మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న క్యానం అన్వేష్ కుటుంబంతో తల్లి అస్తికలు కాశీలో కలపడానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి బెడ్‌రూం చిందరవందరగా ఉంది. బంగారం వస్తువులు, నగదు కనిపించలేదు. దీనిపై బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో సీఐ కాశీ విశ్వనాథ్ తన బృందంతో దర్యాప్తు ప్రారంభించారు. ఇద్దరు వ్యక్తులు హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండ గా పట్టుకున్నారు. వాళ్లను ప్రశ్నించి ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్నారని నిర్ధారించుకు న్నారు. దీంతో ఒడిశాలోని జాగ్మోరా భువనేశ్వర్‌కి చెందిన ప్రశాంత కుమార్ కరాడా, గంజాంకు చెందిన సాగర్ కుమార్ పాండాను అరెస్టు చేశామని డీఎస్పీ వివరించారు. ఈ ఇద్దరూ 2000వ సంవత్సరం నుంచి నేరాలు చేస్తున్నారు. విశాఖ పట్నం ప్రాంతంలో 11, కాకినాడ 4, గుంటూరు 3, ఒడిశాలోని బరంపురం 5, భైద్యనాథ్ 4, బడా బజార్ 5, గుస్సాన్ 8, హైదరాబాద్‌లోని కూక ట్‌పల్లి 6, నాగ్‌పూర్ ప్రతాప్‌నగర్‌లో 10తో కలిపి సుమారు 97 కేసులు ఉన్నాయి" అని డీఎస్పీ తెలిపారు. ప్రశాంత్ కుమార్ కరుడుగట్టిన దొంగ అని, నాలుగేళ్ల నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడని చెప్పారు. కలకత్తాలో ఓ సారి కాల్పులు కూడా జరిపాడన్నారు. నిందితుల నుంచి రూ.9.98 లక్షల విలువైన నగదు, నగలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. క్లిష్టమైన కేసును నెల రోజుల్లో పరిష్కరించడంలో ప్రతిభ చూపిన సీఐ కాశీ విశ్వనాథం, ఎస్ఐ మురళీ మోహన్, హెచ్‌సీలు వెంకటేశ్వరరావు, ప్రసాద్, వెంకట రమణ, పీసీలు సురేశ్ బాబు, మనికంఠ, హరీశ్, పూర్ణిమా రాజ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

భక్తుల ముసుగులో దొంగతనాలు

అన్నవరంలో ఇద్దరి అరెస్ట్

అన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భక్తులే వారికి టార్గెట్. రత్నగిరిపై వ్రతమండపాల్లో భక్తులు టెంకాయిలు కొట్టే సమయంలో జేబులో నగదు, చేతికి ఉంగరాలు, ఇతర వస్తువులు చాకచక్యంగా కొట్టేస్తుంటారు. కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో భక్తుల ముసుగులో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం రూ.300 వ్రత మండపం వద్ద ఈ విధంగా చేయడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న భద్రత సిబ్బంది పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అన్నవరం ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.11500 సొత్తును స్వాధీనం చేసుకుని, హైదరాబాద్‌కు చెందిన భక్తుల నగదుగా గుర్తించి వారికి అందజేశారు. నిందితులను గుంటూరు జిల్లా తాడేపల్లి సెంటర్‌కు చెందిన ఇట్ట సత్యనారాయణ, బాలసాని వెంకటభాస్కరరావుగా గుర్తించినట్టు సమాచారం. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ నిందితులు గతంలో చేపట్టిన నేరాలపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



పట్టుబడ్డ నిందితులు

గోదావరిలో యువకుడి మృతదేహం లభ్యం

అలమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు వద్ద గోదావరిలో శనివారం సాయంత్రం యువకుడి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశా రు. మండపేట మండలం తాపేశ్వరం గ్రామానికి చెందిన సురేష్‌కుమార్ ఆరు రోజుల క్రితం రాజమహేంద్రవరం గోదావరి పుష్కర్‌ఘాట్ వద్ద స్నానం చేస్తుండగా మునిగిపోయి గల్లంతు అయినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసి తరలించారు.



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

డొంకరాయి 7వ గేటు ఎత్తివేత

మోతుగూడెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని డొంకరాయి ప్రధాన ఆనకట్ట 7వ గేటును 2.90 అడుగుల మేర ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యామ్ ఏఈ శివశంకర్ తెలిపారు. ఈ ప్రధాన ఆనకట్ట గరిష్ఠ నీటి మట్టం 1037 అడుగులు కాగా గత వారంరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శనివారం సాయంత్రానికి ఆనకట్ట నీటి మట్టం 1035.60 అడుగులకు చేరుకుంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ శివశంకర్ తెలిపారు. రాత్రంతా పెట్రోలింగ్ చేస్తూ నీటి మట్టం సాధారణ స్థితికి వచ్చిన తర్వాత గేటును మూసివేస్తామన్నారు.



విడుదలవుతున్న వరద నీరు

వరద గోదారి

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- 236 మంది మత్స్యకారులు పునరావాస కేంద్రానికి తరలింపు
- 'తూర్పు' కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం/కె.గంగవరం/రావులపాలెం/ఆలమూరు/చింతూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో దిగువన గోదావరిలో వరద ఉధృతంగా ప్రవహిస్తోందని, ఇంకా పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ కీర్తి తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శనివారం సాయంత్రం 5గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశామన్నారు. రాజమహేంద్రవరంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. కాటన్ బ్యారేజ్, ఆల్కాట్ గార్డెన్స్, గౌతమీ ఘాట్ తదితర లోతట్టు ప్రాంతాలను పరిశీలించి సమీక్ష చేశారు. లంకల్లోని 236 మంది మత్స్యకారులను పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కలెక్టర్ సూచించారు.రాత్రి 8గంటలకు కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి మట్టం 12.10 అడుగులకు చేరింది. ఇది 13.75కి చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. బ్యారేజీ వద్ద అన్ని గేట్లు ఎత్తివేసి 10,25,073 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా కె.గంగవరం మండలం కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవు,స్థానిక పుష్కరాల రేవులోని మెట్లు మునిగిపోయాయి.రావులపాలెం మండల పరిధిలోని గౌతమి, వశిష్ట పాయలలో గోదావరి వరద క్రమంగా పెరుగుతోంది. దీంతో పల్లపు లంక ప్రాంతాలు మరోమారు ముంపుబారిన పడుతున్నాయి. ఆలమూరు మండలంలోని లంక గ్రామాలైన బడుగువానిలంక, చెముడులంక, చొప్పెల్ల, మడికి, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లోని లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరుకుంది. జొన్నాడ వద్ద పుష్కరఘాట్ నీట మునిగింది. జొన్నాడ బ్రిడ్జిల మధ్య వరద ఉధృతంగా ప్రవహిస్తోంది.



రావులపాలెం వద్ద వరద ఉధృతి



చింతూరు: నిమ్మలగూడెం-కుయుగూరుల నడుమ ప్రధాన రహదారిపై వరద నీరు

కాసింత తగ్గిన గోదావరి

చింతూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి కాసింత తగ్గుముఖం పట్టింది. శనివారం ఉదయం 6గంటలకు 46.60 అడుగులుగా ఉన్న నీట మట్టం సాయంత్రం 6గంటలకు 44.30 అడుగులకు తగ్గింది. గోదావరి ఉధృతితో శబరి నది ఎగపోటుకు గురైంది. దీంతో చింతూరు డివిజను లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.చింతూరు-వరరామచంద్రపురం, చింతూరు-కూనవరం, కూనవరం-ఎటపాక ప్రధాన రహదార్లపై వరద నీరు చేరింది. కూనవరం, ఎటపాక మండలాల్లో మిర్చి తోటలు నీట మునిగాయి. 326వ నెంబరు జాతీయ రహదారి చింతూరు మండలం, నిమ్మలగూడెం,కుయుగూరుల నడుమ నీట మునిగింది.

రావులపాలెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా

నేడు పోతంశెట్టి ప్రమాణస్వీకారం



రావులపాలెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా, రాజా పురస్కార అవార్డు గ్రహీత పోతంశెట్టి కనికిరెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. రావులపాలెంలో పోతంశెట్టి విద్యా, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ విద్యా అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పాతికేళ్లపాటు పని చేశారు. గ్రామ విద్యాకమిటీ అధ్యక్షుడిగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యా విధానంలో అనేక మార్పులను తీసుకొచ్చారు. తన సొంత ఖర్చులతో విద్యార్థులకు క్రీడల్లో మంచి శిక్షణ ఇప్పించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపించారు. పలుమార్లు బాలుర, బాలికల జోన్, సెంట్రల్ జోన్ క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పలు సేవలందించారు. ఆధ్యాత్మిక రంగంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా జీర్ణావస్థలో ఉన్న మునలి రామాలయం స్థానంలో సీతారామచంద్రస్వామి, శిరిడిసాయి ఆలయా లు, అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఏటా స్వామి వారి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.కొత్తపేట నియోజకవర్గ టింబర్ అండ్ బ్యాంబూ సామిళ్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా అసోసియేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టింబర్ మర్చంట్ అసోసియేషన్‌కు గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతూ వస్తున్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో 15ఏళ్లుగా తెలుగు వర్తకుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతూ తెలుగు వర్తకుల సౌకర్యం కోసం జగదల్పూర్‌లో రూ.కోటితో భవన నిర్మాణం చేపట్టారు.

సారాతో ఇద్దరు వ్యక్తుల అరెస్టు

బిక్కవోలు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం రంగాపురంలో సారా కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ శనివారం తెలిపారు. గ్రామంలో దాడులు నిర్వహించగా యదల రాంబాబు, మాదబోయిన రాముడుల వద్ద 20 లీటర్ల సారా ఉందని, దీంతో సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

కనీస సౌకర్యాలపై తొలి నివేదిక

శాసనసభ సభ్యుల సదుపాయాల కమిటీ సభ్యుడు నల్లమిల్లి



అనపర్తి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా శాసన సభ, శాసన మండలి, మాజీ సభ్యులకు అత్యవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి సౌకర్యాల కమిటీ తొలి నివేదికను అందించినట్టు సౌకర్యాల కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం శాసన సభలో ఆయన సౌకర్యాల కమిటీ తొలి నివేదికను సభకు సర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యులకు, మాజీ సభ్యులకు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే కమిటీ ద్వారా ప్రభుత్వానికి సిఫారసు చేస్తే బావుంటుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన సూచనల మేరకు కమిటీ సభ్యులు పలు అంశాలను కూలంకుషంగా చర్చించి ఈ అంశాలను ప్రభుత్వానికి సిఫారసు చేశామన్నారు. పలు విషయాలపై వివిధ రాష్ట్రాల శాసన వ్యవస్థల నుంచి సేకరించిన సమాచారంతో అధ్యయనం చేసిన తరువాత మాజీ ఎమ్మెల్యేలకు మణిపూర్‌లో రూ.70 వేలు అరుణాచల్‌లో రూ.50 వేలు, హరియాణా, తెలంగాణలలో కనీసం రూ.50 వేలుగా ఉందన్న విషయాన్ని పరిగణలోకి తీసుకున్నామన్నారు. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కొందరి మాజీ సభ్యుల ఆర్థిక స్థితి అంతంత మాత్రంగా ఉన్న వాస్తవాన్ని గుర్తించి ఏపీలో కనీసం నెలసరి పింఛను రూ.30 వేలు నుంచి రూ.50వేలకు పెంచాలని కమిటీ సిఫారసు చేసిందన్నారు. అలాగే ప్రస్తుత, మాజీ సభ్యులకు అఖిల భారత సర్వీస్ అధికారులతో సమానంగా వైద్య సదుపాయాల కల్పనకు కమిటీ సిఫారసు చేసిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వివరించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల సాంస్కృతిక ప్రదర్శన



శిబిరంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో జరుగుతున్న ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరంలో శనివారం సాంస్కృతిక కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిస్సా, పంజాబ్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని తెలియజేసేవిధంగా పలు ప్రదర్శనలు ఇచ్చారు. తమ రాష్ట్రాల ప్రత్యేక సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రతీ బృందం హైలెట్ చేసింది. అలాగే భారత్ దృష్టిలో ఎన్‌సీసీ సహకారం అనే అంశంపై రంగోళి పోటీ నిర్వహించారు. ప్రగతి శీల, ఐక్యమైన స్థితిస్థాపక భారతదేశాన్ని రూపొందించడంలో ఎన్‌సీసీ క్యాడెట్ల పాత్రను చిత్రీకరించేందుకు ఈ పోటీలు ప్రోత్సాహాన్నిచ్చాయి. ఏడు డైరెక్టరేట్ల నుంచి క్యాడెట్లు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్ఎం అగర్వాల్‌కు క్యాడెట్లు గౌరవవందనాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ హెచ్ఎస్ మాణిక్, సుబేదార్ మేజర్ మణిదీప్ సింగ్, శిబిరం సూపరింటెండెంట్ శేషేంద్ర, సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బేరింగుల దొంగతనం కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు. ఎస్.కొత్తపల్లికి చెందిన కోడూరు సుబ్బారావు గ్రామంలో ట్రాక్టర్ విడి భాగాల వ్యాపారం చేస్తున్నాడు. అయితే ఇంటిని, వ్యాపారాన్ని గ్రామానికి చెందిన వాతాడ వెంకటేశ్వరరావుకు అప్పగించి ఇటీవల సుబ్బారావు హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ నెల 21న దొంగలు రూ.36 వేలు విలువ చేసే ట్రాక్టర్ బేరింగ్‌లు చోరీ చేశారు. కాగా దొంగిలించిన బేరింగ్‌లతో శనివారం ఆటోలో వెళ్తున్న యలమంచిలి శివరావు, లంకే బ్రహ్మాజీ, ఆదివారపుపేట గణపతిలను పట్టుకుని ఆటో సీజ్ చేశామని పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి అమలాపురం కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి):అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామిని అమలాపురానికి చెందిన రాయపురెడ్డి అఖిల్‌సాయిరామ్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అన్నప్రసాద ట్రస్టుకు రూ.59వేలు విరాళం అందజేశారు. ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

లలితా త్రిపురసుందరీదేవిగా విజయదుర్గమ్మ దర్శనం



అమలాపురం, ముమ్మిడివరం, అంబాజీపేట, మామిడికుదురు మండలాల్లో, యానాంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

అమలాపురంటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లు భక్తులకు శ్రీలలితా త్రిపురసుందరిదేవిగా దర్శనమిచ్చారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీకల్యాణ దుర్గమ్మను చెక్కల వెంకటబాపనయ్యసత్యరామలక్ష్మి కుటుంబీకులు అమ్మవారిని లలితాత్రిపురసుందరిదేవిగా అలంకారం చేయించారు. శ్రీదేవి మార్కెట్‌సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారు, అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న వైష్ణవీ కనకదుర్గమ్మ, ఈదరపల్లి వంతెన వద్ద దుర్గాభవానీ అమ్మవారు భక్తులకు లలితా త్రిపురసుందరిదేవిగా దర్శనం ఇచ్చారు. విశేష అలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. భట్నవిల్లిలో జాతీయ రహదారి చెంతన ఉన్న శ్రీవిజయదుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఐవీ సత్యనారాయణ, దంగేటి వెంకటకృష్ణారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో లలితా త్రిపుర సుందరిదేవిగా విశేష అలంకారం చేయించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): అల్లవరం విజయకనకదుర్గ ఆలయంలో దాసం శ్రీరామచంద్రమూర్తి, బండిగుప్తాపు నాగేశ్వరరావు, దాసం వెంకటరత్నం, అడపా వెంకటకృష్ణ, అరిగెల త్రినాథరావు దంపతులు కర్తలుగా వేదపండితులు మంగళంపల్లి పాండురంగ విఠల్ బ్రహ్మత్వాన దుర్గా చండీ హోమం నిర్వహించారు.బెండమూర్లంకలో కనకదుర్గ ఆలయం వద్ద 108కలశాలతో ముత్తయిదువులు వైనతేయ జలాలను తీసుకువచ్చి దుర్గాదేవికి జలాభిషేకం చేశారు.మొగళ్లమూరి, అల్లవరం, బెండమూర్లంక, గోడిలంక, కోడూరుపాడు,డి.రావులపాలెం, దేవగుప్తంగ్రామాల్లో కనకదుర్గమ్మకు కుంకుమ పూజలు నిర్వహించారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి):కాట్రేనికోన మావుళ్ళమ్మతల్లి శనివారం శ్రీలలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చెయ్యేరు గ్రామదేవత దాసులమ్మ ఆలయంలో నంద్యాల పెద్దకాపు దంపతులు, పలువురు మహిళలు కనకదుర్గ అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆణివిళ్ళ ఫణికాంత్‌శాస్త్రి ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో నంద్యాల పెద్దకాపు దంపతులు, నంద్యాల వెంకటరెడ్డి దంపతులు, నంద్యాల శివ, నంద్యాల తాతాజీ, కె.శివ పాల్గొన్నారు. చింతలమెరక తిమ్మాపురం గ్రామంలో శ్రీవిజయలక్ష్మీ దుర్గ ఆలయంలో వనచర్ల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, వనచర్ల ఈశ్వరరావు దంపతుల నిర్వహణలో ఆకొండి మహేష్‌శర్మ ఆధ్వర్యంలో కుంకుమపూజ, సహస్రనామార్చన జరిగింది.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): చినకొత్తలంకలోని శ్రీపట్టాభి రామస్వామివారి ఆలయంలో విజయదుర్గమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారినిశనివారం లలితాత్రిపురసుందరిదేవిగా అలంకరించారు. ముమ్మిడివరం మెయిన్‌రోడ్డులోని ఈశ్వరమ్మవారి ఆలయంలో విజయదుర్గమ్మవారు లలితాత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవార్ని బాలాత్రిపురసుందరిగా అలంకరించారు. అంబాజీపేట సంతమార్కెట్‌లోఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో, అంబాజీపేట విజయభేతాళస్వామి, పక్షులరావిచెట్టు వద్ద అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అమ్మవారి ఆలయాల్లో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీవీణాశ్యామలాంబ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): ఆశ్వయుజ మాసం పంచమి శనివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి, నల్లచెరువులో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అయినవిల్లి సిద్ధివినాయకుడి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. క్యూలైన్లు, ఆలయ మండపాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలోఆలయ సిబ్బంది సేవలందించారు. సిద్ధివినాయక ఆలయం వద్ద నూతన వాహనాలకు పూజలు జరిపించుకున్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): ఎస్.యానాంలో కొలువుతీరిన శ్రీప్రసన్నదుర్గాంబికాదేవి శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. గొల్లవిల్లి కనకదుర్గ ఆలయం వద్ద దసరా ఉత్సవాల సందర్భంగా శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి శ్రీబాలబాలాజీస్వామి సన్నిధిలో ఉన్న శ్రీమహాలక్ష్మీదేవి అమ్మవారు శ్రీధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాశర్లపూడి బాడవలోని కనకదుర్గమ్మవారు లలితా త్రిపురసుందరిగా, పెదపట్నంలంకలోని అమ్మవారు కాత్యాయినిగా భక్తులకు సాక్షాత్కరించారు. పాశర్లపూడిలో లక్ష కుంకుమార్చన, గణపతి అభిషేకాలు, మల్లేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన తదితర పూజలను ఘనంగా చేశారు. మామిడికుదురులోని విజయదుర్గమ్మకు కనకాంబరాలతో విశేషార్చన నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాం శివారు గిరియాంపేటరోడ్డులోని శ్రీపాలకనకదుర్గమ్మను అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. పడవలరేవు వీధిలోని లలితాదేవి ఆలయంలో అమ్మవారు లక్ష్మీదేవిగా, గోపాల్‌నగర్‌లోని శారదాదేవి (సరస్వతి) ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో, శివాలయం ప్రాంగణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆక్వా చెరువుల వద్ద మత్స్యకార మహిళల ధర్నా



ఎన్.రామేశ్వరంలో ఆక్వా చెరువుల వద్ద ఆందోళన చేస్తున్న మత్స్యకార మహిళలు

అల్లవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 1994లోప్రభుత్వం ద్వారా మంజూరైన ఏకసాల్ లీజ్ పట్టా భూములు తమకు తిరిగి ఇప్పించాలంటూ కొమరగిరిపట్నం శివారు ఎన్.రామేశ్వరం పట్టా భూముల్లో ఆక్వా చెరువుల వద్ద మత్స్యకార మహిళలు, మత్స్యకారులు శనివారం ధర్నా చేశారు. ఎన్.రామేశ్వరంలో 1652 సర్వే నంబరులో 55ఎకరాల భూమికి సంబంధించి 55మందికి పట్టాలు మంజూరు చేశారు. కొందరు దళారీలు పెద్దల ముసుగులో ఆ భూముల్లో ఆక్వా చెరువులు తవ్వించి లీజు సొమ్ము కాజేస్తున్నారని మహిళలు ఆరోపించారు. మా పొట్ట కొట్టొద్దు, మా పట్టా భూములు మాకు కావాలి, దళారీ దోపిడీని అరికట్టాలంటూ మత్స్యకార మహిళలు నినాదాలు చేశారు. సొసైటీ భూములు, పట్టా భూముల్లో ఆక్వా చెరువులు తవ్వి దోపిడీ చేస్తున్నారని, అడిగితే తప్పుడు కేసులు పెడుతున్నారంటూ వారు ధ్వజమెత్తారు. చెక్కా అంజనేయులు, పంతాడి సత్యనారాయణ, అంగాడి విష్ణు, మల్లాడి నరేష్, అంగాడి గోవిందు, కొపనాతి కాళికేశ్వరి, కర్రి ధనలక్ష్మి, అంగాడి అన్నపూర్ణ, వైదాడి ధనలక్ష్మి, అంగాడి మంగాయమ్మ, మత్స్యకార మహిళలు రామేశ్వరం ఆక్వా చెరువుల వద్ద ఆందోళన చేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

దొంగ ఓట్లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురంటౌన్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న దొంగ ఓట్లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన పోరాటానికి సంఘీభావంగా ప్రతీ ఒక్కరూ నిలవాలని కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రమాజీ అధికార ప్రతినిధి ముషిణి రామకృష్ణారావు, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, బీసీ సెల్ మాజీఅధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వస్కా బాబు, నిమ్మకాయల ప్రసాద్, మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు, ఏలేశ్వరపు రాధాకృష్ణ, మొల్లేటి వెంకటేశ్వరరావు, జోగి అర్జునరావు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న సతీష్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న ఆధునిక సాంకేతిక మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు అందించుకోవాలని వనహా ముఖ్య కార్యనిర్వాహక అధికారి, రిసోర్సుపర్సన్ శతద్రు చౌదరి పేర్కొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రైమ్ వేరా సాఫ్ట్‌వేర్‌పై ఐదు రోజుల వర్కు షాప్ శనివారంతో ముగిసింది. రిసోర్సుపర్సన్ శతద్రు చౌదరి విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో ఉపకరణాల నిర్వహణ, సాఫ్ట్‌వేర్ వినియోగం, వనరుల వినియోగం తదితర అంశాలపై వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్ పాల్గొన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కృష్ణసతీష్ ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ ఎంసీఎస్ మధన్, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, సివిల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయ వనరులపై శిక్షణ

అంబాజీపేట,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఆదాయ వనరులు, అభివృద్ధి తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.మమత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రహదారులు,డ్రైనేజీల అభివృద్ధి, తాగునీటి ట్యాంకులు, పంచాయతీలకు నిధులు, ఆదాయం సమకూర్చుకోవడం తదితర అంశాలపై డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్ అవగాహన కల్పించారు.

ఓపెన్ ఎయిర్ ఫిట్నెస్ పరికరాలు ఏర్పాటుచేయాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ పబ్లిక్ పార్కులో ప్రజారోగ్యంలో భాగంగా ఓపెన్ ఎయిర్ ఫిట్‌నెస్ పరికరాలను ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కుమార్‌కు జనవిజ్ఞానవేదిక జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం, కోశాధికారి జి.త్రినాథ్ శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఫిట్‌నెస్ పరికరాలు వ్యాయామంతో పాటు శరీర సౌష్టవానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

మీనామృతంతో వరి ఎదుగుదల బాగు



ద్రావణాన్ని వరిపైరుకు డ్రోన్‌తో పిచికారి విధానాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఏడీఏ విజయకుమార్

పి.గన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వరి చేలకు మీనామృతం (చేప, బెల్లం ద్రావణం) పిచికారి చేయడం ద్వారా వరి ఎదుగుదల బాగుంటుందని ఇంచార్జ్ ఏడీఏ సీహెచ్‌డి విజయకుమార్ సూచించారు. ఆర్.ఏనుగుపల్లిలో చేప, బెల్లంతో తయారు చేసిన మీనామృతం ద్రావణాన్ని డ్రోన్ ద్వారా పిచాకారి చేసే కార్యక్రమాన్ని పరిశీలించి అనంతరం మాట్లాడారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని, తద్వార తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన పంటను పండించవచ్చన్నారు. డ్రోన్ ద్వారా పది నిమిషాల్లో ఎకరం వరికి పిచికారి పూర్తవుతుందని, అద్దె రూ.350 తీసుకుంటారని చెప్పారు. డ్రోన్ ద్వారా స్థానిక రైతు రుద్రరాజు వెంకటసూర్యనారాయణరాజు 5.50 ఎకరాల పొలంలో గ్రోత్‌ప్రమోటర్ మీనామృతాన్ని పిచికారి చేయించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ జె.నాగ వేణి, యూనిట్ ఇంచార్జ్ బి.నారాయణరావు, వీహెచ్‌ఏ సురేష్, వీఏఏ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి

పి.గన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఉన్న ఆస్తులు నుంచి స్వంత ఆదాయ వనరులను ప్రణాళిక బద్ధంగా సమకూర్చుకోవాలని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి సూచించారు. స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో శనివారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన రెండు రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీల్లో ముఖ్యంగా ఇంటిపన్ను, పంచాయతీ ఆస్తులు ద్వారా వచ్చే ఆదాయం, ఇతర ఫీజులను పూర్తిస్థాయిలో వసూళ్లు చేయాలన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులకు పలు అంశాలపై ట్రైనింగ్ పొందిన పంచాయతీ కార్యదర్శి అనిల్ అవగహన కల్పించారు. ఎంపీడీవో జి.మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో జి.ఉమామహేశ్వరావు, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి



పి.గన్నవరం, సెప్టెంబరు27(ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు.అమరావతిలో శుక్రవారంరాత్రి సీఎంను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రి బిల్లులు మంజూరు చేయాలని సీఎంను ఎమ్మెల్యే కోరారు.

వైసీపీ సమావేశం

అంతర్వేది, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయి నాయకులతో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అంతర్వేది దేవస్థానం గ్రామంలో శనివారం సమావేశం నిర్వహించారు. వైసీపీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని గొల్లపల్లి కోరారు. కార్యక్రమంలో పాటి శివకుమార్, కేఎస్ఎన్ రాజు, కుసుమ చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు పాల్గొన్నారు.

సొసైటీల్లో రుణాలకు ఓటీఎస్ అమలుచేయాలి

మామిడికుదురు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సొసైటీల్లో దీర్ఘ కాలిక రుణాలకు ఓటీఎస్ అమలు చేయాలని మామిడికుదురు సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్ కోరారు. చైర్మన్ అధ్యక్షతన శనివారం సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో వాయిదా మీరిన బకాయిలు సొసైటీల్లో పెరిగిపోతున్నాయని, వాటికి ఓటీఎస్ పద్ధతి అమలు చేయడం వల్ల రైతులు, సొసైటీలకు లాభదాయకంగా ఉంటుందన్నారు. రైతు నేస్తం పథకం కింద ఎకరాకు రూ.8లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ అన్నారు. కార్యక్రమంలో సభ్యులు కాకి శ్రీనివాస్, మట్టా సత్యనారాయణ, సీఈవో అడబాల పెద్దిరాజు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలకు వచ్చే దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు పంచాయతీ వద్ద సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్ పరీక్షలు నిర్వహించారు.ఎంపీటీసీ నెల్లి పండు, సీహెచ్‌వో అప్పారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఓడలరేవులో వైద్య శిబిరం

అల్లవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ ఆధ్వర్యంలో శనివారం స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం జరిగింది. 90మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హోమియో వైద్యులు డాక్టర్ లూక్ హజార్య, సూపర్‌వైజర్లు ఎన్.రంగనాథ్, కె.సుజాత, మల్లాడి ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పి.సాయిబాబు, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీలు పాల్గొని సేవలందించారు.

సత్యభాస్కర్‌కు ఉత్తమ రైతు పురస్కారం



యానాం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): యానానికి చెందిన వ్యాపారవేత్త, రైతు, వర్తకసంఘం గౌరవాధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్ ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యారు. వ్యవసాయ అనుబంధ రంగాల విభాగాల్లో ప్రతీ సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఏరువాక ఫౌండేషన్ వ్యవసాయ వార్షిక అవార్డులను ప్రకటిస్తుంది. విజయవాడలో శుక్రవారం జరిగిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉత్తమసేవా పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: సీఐ

రాజోలు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ కోరారు. రాజోలులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా ప్రజలందరూ స్నేహభావంతో పండుగను జరుపుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర పోలీసు డిపార్టుమెంటువారు లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్‌ను ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌కు అనుసంధానం చేశారని తెలిపారు. దీనికోసం ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని యాప్ ద్వారా రిక్వెస్ట్ పెట్టుకుంటే మీ పరిధిలోని పోలీసు స్టేషన్ నుంచి పోలీసు వారు మీ ఇంటికి వచ్చి కెమెరాను అమర్చి నిరంతరం కంట్రోల్ రూము నుంచి పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఈ సదుపాయం కోసం ఎటువంటి ఖర్చు ఉండదని, కేవలం రిజిస్ట్రేషన్ చేసుకోవడం సరిపోతుందని సీఐ నరేష్‌కుమార్ తెలిపారు.

తెలగ ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షుడు నాగభూషణం మృతి



రాజోలు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మెరకపాలేనికి చెందిన రాజోలు తాలూకా తెలగ ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వీరా నాగభూషణం(90) శుక్రవారం రాత్రి మృతిచెందారు. ఆయన శివకోడు తెలగ కల్యాణ మండపం నిర్మాణం, సంఘం అభివృద్ధికి కృషి చేశారు. ఆయనకు ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు. నాగభూషణం కుటుంబ సభ్యులను రాజోలు తాలూకా తెలుగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొమ్ముల మధుమూర్తి, ఉపాధ్యక్షుడు కుంపట్ల చిన్నారి, కార్యదర్శి చిక్కాల వెంకట్రావు, కోశాధికారి అడబాల శ్రీఆంజనేయులు, తులా సత్యనారాయణ, అడబాల సూర్యారావు, తెలగ ఉద్యోగులు పరామర్శించారు.

వివాదాస్పద ఫ్లెక్సీలను తొలగించాలి

మామిడికుదురు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వివాదాలకు కారణమవుతున్న ఫ్లెక్సీలను గ్రామాల్లో తొలగించాలని నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు జరుగుతున్న శిక్షణ సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. ఫ్లెక్సీలపై ఇటీవల రాసిన రాతలు శాంతి భద్రతలకు సమస్యగా తయారయ్యాయన్నారు. వివాదాలకు కారణమవుతున్న కొటేషన్లతో ఏర్పాటుచేసే ఫ్లెక్సీలను గ్రామాల్లో పెట్టకుండా చూడాలని కోరారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు తప్పనిసరిగా పంచాయతీ అనుమతి తీసుకోవాలని, అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.భవానీ, డిప్యూటీ ఎంపీడీవో అడబాల శ్రీనివాస్, ఏవో కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మురమళ్ళ దేవస్థానం ట్రస్టుబోర్డు ప్రమాణస్వీకారం

ఐ.పోలవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరాస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు ప్రమాణ స్వీకారం ఈనెల 29వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. పది మందితో కూడిన ధర్మకర్తల మండలిని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా దాట్ల రామకృష్ణంరాజు, సభ్యులుగా పెద్దింటి మారుతీశ్రీవాణి, పెన్మెత్స రామరాజు, చవటపల్లి నాగేంద్రరావు, కర్రి చంద్రశేఖర్, విత్తనాల సత్యనారాయణ, గంగుల జయలక్ష్మి, గొల్లవిల్లి సునీత, పాటి సీతామహాలక్ష్మి, మద్దాల వెంకటేశ్వరరావు, ఎక్స్అఫిషియో సభ్యునిగా పేటేటి వీరవెంకటసుబ్బారావును నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ట్రస్టుబోర్డు ప్రమాణస్వీకార మహోత్సవానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు హాజరుకానున్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతాలు



ఐసీడీఎస్ ప్రదర్శన

మలికిపురం,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల సందర్భంగా వుయ్యూరివారి మెరకలో రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. సీడీపీవో సీహెచ్ ఇందిర మాట్లాడుతూ స్థానికంగా లభించే వస్తువులతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను తయారు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, సూపర్‌వైజర్ చంద్రకళ, కె.రత్నకుమారి, నందిని, నాగమ్మ, బీవీ రత్నకుమారి, సత్యరాజేశ్వరి, ఎస్తేరు, కుమారిదుర్గ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయంలో కమిషనర్ రాజీవ్ పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విజయవాడ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజీవ్‌కుమార్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయఅర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న వారికి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి అందించారు.

నేడు యానాం వెంకన్న కల్యాణం



యానాం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి బాలాలయంలో త్రివింశతి (23వ) బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. వెంకన్న బ్రహ్మోత్సవాలను కరకుదురు వాస్తవ్యులు వాడపల్లి గోపాలాచార్యుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌కు నేతల అభినందనలు



సత్తిబాబును కలిసిన మట్టపర్తి రామకృష్ణ, మండల నాయకులు

పి.గన్నవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజగా కుల ధ్రువీకరణ ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం జీవో నెం.6ను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీకి చెందిన పలువురు శెట్టిబలిజ నాయకులు శనివారం శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబును కలిశారు. ఈసందర్భంగా సత్తిబాబును దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టపర్తి రామకృష్ణ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గుత్తుల రామకృష్ణ, నాయకులు చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, చీకట్ల రామకృష్ణ అభినందనలు తెలిపారు.

దసరా ఉత్సవాలపై సీసీ కెమెరాలతో నిఘా

అల్లవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో ఎటువంటి అసాంఘిక శక్తులు చొరబడి గొడవలకు దిగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో దసరా ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ సూచించారు. ఎస్ఐ బి.సంపత్‌కుమార్ ఉన్నారు.

'బాలకృష్ణ వ్యాఖ్యలు దారుణం'

ముమ్మిడివరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు బాధాకరమైనవని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని సైకో అని నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించడం దారుణమన్నారు. ప్రముఖ సినీనటుడు చిరంజీవిని అవమానకరంగా మాట్లాడడం అంటే ఆయన అభిమానులను అవమానించడమే అన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

అరుణ మృతికి సంతాపం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి ఎస్.అరుణ ఆకస్మిక మృతికి శ్రీశ్రీకళావేదిక జిల్లాశాఖ, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం నడిపూడి డాబా గార్డెన్స్‌లో సంతాప సభ నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త, శ్రీశ్రీకళావేదిక జిల్లాశాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్.గోపి జీవిత భాగస్వామి అయిన అరుణ ఆకస్మిక మృతి సాహితీలోకానికి తీరనిలోటన్నారు. ఆమె రచించిన అనేక గ్రంథాల్లోని వివరాలను ఆయన వివరించారు. సంతాప సభలో జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు, కోనసీమరచయితల సంఘం జిల్లాశాఖఅధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, అరిగెల బలరామమూర్తి, పసలపూడి సతీష్, పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి, గంటి చంద్రశేఖర్, మెండి కమల, కడలి సత్యనారాయణ, కడలి రామకృష్ణారావు సంతాపం తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు శిక్షణ

మామిడికుదురు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకంలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇస్తున్నట్టుగా ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు తెలిపారు. మామిడికుదురులో ప్రభుత్వ జడ్పీస్కూలు పదో తరగతి విద్యార్థులకు వృత్తి శిక్షణ కోర్సుల్లో భాగంగా ఫుడ్ ప్రోసెసింగ్, ఎలక్ట్రానిక్స్ రిటైల్ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జె.మౌనికకృష్ణ పాల్గొన్నారు.

క్రైమ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



క్రైమ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్పీ రాహుల్ మీనా శనివారం సాయంత్రం జిల్లా సాయుధ రిజర్వు కార్యాలయం, సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా క్రైమ్ పోలీసు స్టేషన్‌ను సందర్శించి పోలీసులకు ఎస్పీ మీనా పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడేది లేదని సిబ్బంది అప్రమత్తతో సిబ్బంది విధులు నిర్వహించాలని, ఎస్కార్ట్ డ్యూటీలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేరస్తుల సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు కేసులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసాద్, పలువురు పోలీసు అధికారులు ఉన్నారు.

స్వస్థ నారీ అభియాన్ వైద్య శిబిరం

అయినవిల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేదునూరు సర్పంచ్ గుమ్మిడి ప్రసాద్ అన్నారు. శనివారం నేదునూరులో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.మంగాదేవి, డాక్టర్ పి.సంతోష్, హెల్త్ అసిస్టెంట్ పి.తాతాజీరావు, ఎంపీటీసీలు కళ్లేపల్లి సుబ్బరాజు, ఇండుగుల వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మండపేట

దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన శనివారం ఆయా ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులకు అభయమిచ్చారు. మరోవైపు భవానీ భక్తులతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

లలితా త్రిపుర సుందరి..

శిరసా నమామి



లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

ద్రాక్షారామ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆరవరోజు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆరవ రోజు అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రాయవరం, (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరవ రోజు శని వారం రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గ అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవి గా పూజలందుకున్నారు. విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి లలితా అష్టోత్తర, సహస్ర నామాలతో మహిళలతో సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. పీఠంలో ఆధ్యాత్మికవేత్త డాక్టర్ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ లలితా త్రిపుర సుందరిదేవి అవతారం విశిష్టతతో పాటు లలితాదేవి వెయ్యి నామాల విశిష్టత వివరించారు. పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మహిళలతో సామూహిక లలితా సహస్రనామ పారాయణలు జరిపి, చతుర్వేద స్వస్తి, దర్బారుసేవ, నీరాజన మంత్రాలు మహా నివేదన జరిపారు. అనంతరం పీఠంలో విజయదుర్గ సేవా సమితి ప్రతినిధులతో అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గ సేవా సమితి ప్రతినిధులు గాదే సత్యవెంకట కామేశ్వరి, భాస్కర నారాయణ, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఠం పీఆర్వో బాబి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

చింతలూరులో కుంకుమార్చనలు

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో శనివారం సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాగణంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.



రాయవరంలో ప్రత్యేక అలంకరణలో వెదురుపాక విజయదుర్గ అమ్మవారు



ఆలమూరులో లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన చింతలూరు నూకాంబిక అమ్మవారు

పురోహితులు వారితో శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శరన్నరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. కపిలేశ్వరపురం, అంగర, కోరుమిల్లి, మాచర, కాలేరు, వల్లూరు తదితర గ్రామాల్లో శనివారం 6వ రోజు లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలు, కూడళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవార్లకు వేద పండితులు, అర్చకులు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ కమిటీలు తదితరులు పాల్గొన్నారు.

భవానీ భక్తుల సందడి

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవరోజు శనివారం ఆయా అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడాయి.. ఉచ్చిలి కాలువ రేవులో ఉన్న విజయదుర్గమ్మ లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఆయా అమ్మవార్ల ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు, భవానీ దీక్షదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఆయా అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. ఈతకోట జాతీయ రహదారి చెంతన ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో భక్తజనం పాల్గొన్నారు. రావులపాలెం కాలువగట్టు చెంతన ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమపూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆత్రేయపురం: ఉచ్చిలిలో లలితా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చిన విజయ కనకదుర్గమ్మవారు



రావులపాలెం మండలం ఈతకోటలో పూర్ణాలంకరణలో కనకదుర్గమ్మ



ఆలమూరు మండలం చింతలూరులో సామూహిక కుంకుమార్చనలు

మందపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.1.41 లక్షలు

కొత్తపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు భక్తజనం బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,41,707 ఒక్క రోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జనార్దనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోనున్న శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయానికి శనివారం భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి తొలిహారం అందించారు. ఆలయ అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ట్రాన్స్‌కో మండపేట డీఈఈ ఎస్.శ్రీధర్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ బైరిశెట్టి రాం బాబు, పలువురు సభ్యులు స్వాగతం పలికారు.



ప్రత్యేక అలంకరణలో నవజనార్దనస్వామి



మండల పరిషత్ కార్యాలయంలో పలు అంశాలపై సమీక్షిస్తున్న ఏవో సురేంద్రరెడ్డి

పంచాయతీ నిధులతో విద్యుత్ బిల్లుల చెల్లింపునపై

సర్పంచ్‌ల ఆగ్రహం

కె.గంగవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులతో విద్యుత్ బిల్లులు చెల్లించమని విద్యుత్‌శాఖ అధికారులు ఒత్తిడి చేయడంపై యర్రపోతవరం సర్పంచ్ పిల్లి రాంబాబు, సత్యవాడ ఉప సర్పంచ్ నలాది వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగింది. శాఖల వారీగా సమీక్ష జరుగుతున్న సందర్భంలో విద్యుత్‌శాఖ ఏఈ భాస్కర కుమార్ తమ శాఖ ప్రగతిని తెలిపారు. ఈ సందర్భంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కల్పించుకుని 15వ ఆర్థికసంఘం నిధులతో విద్యుత్ బిల్లులు చెల్లిస్తే పంచాయతీ నిర్వహణ ఎలా చేయగలమని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి లైట్లు, పంచాయతీ కార్యాలయాలకు సోలార్ సిస్టమ్‌లు అమర్చి విద్యుత్ బిల్లులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. మెగా డీఎస్సీ ద్వారా ప్రభుత్వం టీచరు పోస్టులు భర్తీ చేసిందని, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేస్తున్నందున ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఏ.నాగరాజు కోరారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాల్లో డిసెంబరు 31లోగా గృహాలు నిర్మించుకోకపోతే ప్రభుత్వం వాటిని ఇన్‌ఎక్టివ్‌లో పెడతారని హౌసింగ్ అధికారులు సభలో తెలిపారు. నానో ఎరువుల వాడకం పెంచేలా చూడాలని వ్యవసాయశాఖ ఏవో ఏ. సద్గురు మూర్తి కోరారు. వెలుగు ఏపీయం శామ్యూల్ మాట్లాడుతూ ఈ ఏడాది 12.23 కోట్ల రుణాలు బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు ఇప్పించామన్నారు. ఆరోగ్య, పశువైద్యశాఖల అధికారులు స్వస్థనారీ వైద్య శిబిరాలు, గాలికుంటు నివారణ టీకాల శిబిరాలపై వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ ఓబిళినేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, మండల పరిషత్ కార్యాలయం ఏవో సురేంద్రరెడ్డి, తహసీల్దార్ శ్రీరామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

రిక్షా స్టాండ్‌ను తొలగిస్తే సహించేది లేదు

మండపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణ సుందరీకరణ పేరిట బస్టాండ్ వద్ద రిక్షాస్టాండ్‌ను తొలగిస్తే సహించేది లేదని రిక్షా కార్మికులు, సంఘ నాయకులు హెచ్చరించారు. మండపేటలో శనివారం రిక్షా కార్మికుల సమావేశం జైబీమ్ రిక్షా కార్మిక సంఘ అధ్యక్షుడు ఐనవిల్లి రమణ మాదిగ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు దూళి జయరాజు, మున్సిపల్ కౌన్సిలర్ మందపల్లి రవి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పట్టణాభివృద్ధి పేరిట రిక్షా కార్మికులకు నిర్మించిన షెల్టర్‌ను తొలగించి అందులో మహిళలతో దుకాణాలు నిర్వహిస్తామని చెప్పటం సరికాదన్నారు. ఇప్పటికే రిక్షా కార్మికులకు నీడలేక పట్టణంలో రోడ్డుపక్కన చెట్టుక్రింద స్టాండ్లు నిర్వహించుకుంటున్నామని వాపోయారు. రిక్షా కార్మికుల జీవనంపై ఆటోల ప్రభావం తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రిక్షా స్టాండ్ ను తొలగిస్తే సహించేదిలేదన్నారు. సమావేశంలో రిక్షా కార్మిక సంఘ నాయకులు బుట్టా వీర్రాజు, ఏల్చూరి యేసు, కొమ్ము సత్యనారాయణ, ఏడిద యేసు, పెంటయ్య, కొల్లి శ్రీను, మందపల్లి సుధాకర్, మడికి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్నారన్న సమాచారంపై పోలీసులు దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...పసలపూడి శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.11,400 నగదు, ప్లాస్టిక్ టేబుల్, కుర్చీలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



ఎన్.రామేశ్వరంలో ఆక్వా చెరువుల వద్ద ఆందోళన చేస్తున్న మత్స్యకార మహిళలు

ఆక్వా చెరువుల వద్ద మత్స్యకార మహిళల ధర్నా

అల్లవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 1994లోప్రభుత్వం ద్వారా మంజూరైన ఏక్‌సాల్ లీజ్ పట్టా భూములు తమకు తిరిగి ఇప్పించాలంటూ కొమరగిరిపట్నం శివారు ఎన్.రామేశ్వరం పట్టా భూముల్లో ఆక్వా చెరువుల వద్ద మత్స్యకార మహిళలు, మత్స్యకారులు శనివారం ధర్నా చేశారు. ఎన్.రామేశ్వరంలో 1652 సర్వే నంబరులో 55ఎకరాల భూమికి సంబంధించి 55మందికి పట్టాలు మంజూరు చేశారు. కొందరు దళారీలు పెద్దల ముసుగులో ఆ భూముల్లో ఆక్వా చెరువులు తవ్వించి లీజు సొమ్ము కాజేస్తున్నారని మహిళలు ఆరోపించారు. మా పొట్ట కొట్టొద్దు, మా పట్టా భూములు మాకు కావాలి, దళారీ దోపిడీని అరికట్టాలంటూ మత్స్యకార మహిళలు నినాదాలు చేశారు. సొసైటీ భూములు, పట్టా భూముల్లో ఆక్వా చెరువులు తవ్వి దోపిడీ చేస్తున్నారని, అడిగితే తప్పుడు కేసులు పెడుతున్నారంటూ వారు ధ్వజమెత్తారు. చెక్కా ఆంజనేయులు, పంతాడి సత్యనారాయణ, అంగాడి విష్ణు, మల్లాడి నరేష్, అంగాడి గోవిందు, కొపనాతి కాళికేశ్వరి, కర్రి ధనలక్ష్మి, అంగాడి అన్నపూర్ణ, వైదాడి ధనలక్ష్మి, అంగాడి మంగాయమ్మ, మత్స్యకార మహిళలు రామేశ్వరం ఆక్వా చెరువుల వద్ద ఆందోళన చేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ



బాణసంచా తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న సీఐ

రాయవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం- వి.సావరం రోడ్డులో ఉన్న బాణసంచా తయారీ కేంద్రాలను శనివారం మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పరిశీలించారు. స్థానిక భవానీ ఫైర్‌వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలించి, బాణసంచా తయారీని నిబంధనల ప్రకారం చేపడుతున్నారా అనే విషయాన్ని ఆయన పరిశీలించారు. బాణసంచా తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఐ వెంట ఎస్ఐ సురేష్‌బాబు సిబ్బంది ఉన్నారు.



ఆలమూరులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగుల నిరసన

ఆలమూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు శనివారం ఆలమూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం మార్కెట్ సెంటర్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సమస్యలను పరిష్కరించాలంటూ ఉద్యోగులు వినతిపత్రం అందించి నిరసనలు వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు కోరారు.



వైద్య శిబిరంలో పలు సూచనలు చేస్తున్న దృశ్యం

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేయాలి

ఆత్రేయపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి హైమశ్రీ పేర్కొన్నారు. శనివారం ఆత్రేయపురం ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య వైద్య శిబిరంలో భాగంగా సర్పంచ్ గెడ్డం సుధ అధ్యక్షతన పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళలు ఆరోగ్యవంతంగా ఉండాలని ఆయా వ్యాధులపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.



లొల్లలాకుల వద్ద ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్ ఇక్కట్లు

ఆత్రేయపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): లొల్లలాకుల వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇరుకుగా మారడంతో ట్రాఫిక్ కష్టాలు ఏర్పడ్డాయి. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన వాహనాలు చాలా సేపటి వరకు ట్రాఫిక్‌లో ఉండిపోయాయి. లొల్లలాకుల వద్ద బ్యాంకు కెనాల్ లాకులపై ఇరుకుగా మారడంతో బొబ్బర్లంక నుంచి రావులపాలెం వెళ్లే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సబ్‌జైల్‌ను సందర్శించిన

లోక్ అదాలత్ ఛైర్మన్

ద్రాక్షారామ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండల లోక్ అదాలత్ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు పలు శాఖల అధికారులతో శనివారం సబ్‌జైలును సందర్శించారు. రిమాండ్ ఖైదీలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న ఆహార పదార్థాలపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, ఆర్డీవో డి.అఖిల, వైద్యాధికారులు బీవీవీ సత్యనారాయణ, సుధీర్, విద్యాశాఖ అధికారి పి.రామ లక్ష్మణమూర్తి, సీఐ ఎంవీ నారాయణ, లోక్ అదాలత్ సిబ్బంది సుభాషిణి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు

వినతిపత్రాలు

ద్రాక్షారామ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు శనివారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మహాత్మా గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు అందజేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు మద్దాల బాపూజీ, ఛైర్మన్ విత్తనాల హరికృష్ణ, వైస్ ఛైర్మన్ పులగం రామారెడ్డి, కన్వీనర్ రుద్రాక్షుల దుర్గాప్రసాద్, కో కన్వీనర్ చొల్లంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు సన్మానం

రాయవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వెంటూరు గ్రామంలో ఇటీవల మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన ఏడుగురు ఉపాధ్యాయులకు శనివారం సన్మానం నిర్వహించారు. పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి సత్తా చాటి ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉందుర్తి వీరవేణి, కొండాయిపాలెపు కృష్ణవేణి, మేడిశెట్టి స్వాతి, వాసంశెట్టి మంగాలక్ష్మి, వీవీఎస్‌వై మణికంఠ, వాసంశెట్టి శిరీష తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న ప్రదీప్, మాజీ సర్పంచ్ వాసంశెట్టి రాధాకృష్ణ, రిమ్మలపూడి సూర్యనారాయణ, వాసంశెట్టి లోవరాజు, శ్రీను, గోవిందరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వెంటూరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

గర్భిణులకు సామూహిక సీమంతాలు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టేకి గ్రామంలో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రాజెక్టు అధికారి యు.పూర్ణిమ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యవేణి మాట్లాడుతూ పౌష్ఠికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఐ.మాణిక్యం మాట్లాడుతూ తల్లులకు పౌష్ఠికాహారం, శిశు, చిన్నపిల్లల పోషణ, బాల్యదశ సంరక్షణ, గర్భవతులు తీసుకోవల్సిన ఆహారం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, గర్భవతులు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం



శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులతో ఎంపీడీవో భానూజీరావు

ముగిసిన శిక్షణ తరగతులు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఓన్‌సోర్స్ రెవెన్యూపై మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో హెచ్. భానూజీరావు అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణలో పంచాయతీ నిధులు సొంతంగా సమకూర్చుకునేందుకు, గ్రామంలో ఇతర వనరులపై వచ్చే ఆదాయం పెంపొందించుకోవడం తదితర అంశాలపై ట్రైనర్ కె. రామకృష్ణ వివరించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ శిక్షణ తరగతులు శనివారంతో ముగిసినట్లు ఎంపీడీవో భానూజీరావు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్, ఏవో జి.రాజేంద్రప్రసాద్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.